# వీధి కుక్కల స్వైరవిహారం

- గ్రామాల్లో ప్రజలపై దాడులు చేస్తున్న శునకాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

చివ్వెంల(సూర్యాపేట) : గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజు రోజుకు ఎక్కువ అవుతోంది. మండలంలోని ఏ గ్రామంలో చూసినా కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు భయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. బైక్‌పై వెళ్తున్న వారిని సైతం కుక్కలు వెంటాడి దాడి చేస్తున్నాయి. దీంతో ఆందోళన చెంది కిందపడి గాయాల భారిన పడుతున్నారు. ఇలా రోజు ఎక్కడో ఒక చోట వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. కాలి నడకన వెళ్లేవారి పరిస్థితి గురించి చెప్పనక్కర్లేదు.

**ఫిర్యాదు చేసినా పట్టింపులేదు**

వీధి కుక్కల స్వైరవిహారంపై పలుమార్లు గ్రామ పంచాయతీల్లో, మండల కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల స్వైర విహారానికి చెక్ పెట్టే అవకాశం ఉన్న వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కుక్కల భారిన పడి ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో వదిలి వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో గుంపులుగా రోడ్డుపై ఉన్న కుక్కలు

**బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది**

గ్రామాల్లో వీధి కుక్కలు ఎక్కువగా గుంపులు, గుంపులుగా తిరుగుతూ వెంట పడుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలి.

– చెరుకుపల్లి కిరణ్ కుమార్, వట్టిఖమ్మంపహాడ్,

**కుక్కల బెడద నుంచి రక్షించాలి**

వీధుల్లో కుక్కల బెడద వల్ల భయటకు వెళ్లడానికి చిన్న పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షించాలి.

– ఎండీ. రఫీ, చివ్వెంల

## సీఎం కేసీఆర్‌కు ప్రజల్లో పెరిగిన అభిమానం

సూర్యాపేట : అధికారుల చిత్తశుద్ధి, కార్యకర్తల పట్టుదల, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజల్లో ఉన్న అభిమానానికి నిదర్శనం సూర్యాపేట ప్రగతి నివేదన సభకు తరలివచ్చిన లక్షలాది జనం అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సూర్యాపేటకు స్పోర్ట్స్ స్కూల్ రావడం గొప్ప విషయమన్నారు. కేసీఆర్ సూచన మేరకు కళాభారతికి భానుపురి భారతిగా నామకరణం చేసి అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం సూర్యాపేట మండలం యండ్లపల్లికి చెందిన ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి, నరేష్, రామారావు గ్రామానికి చెందిన రెండో వార్డ్ మెంబర్ మారపాక యాదయ్య యాదయ్య తో పాటు 50 మంది కార్యకర్తలు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట క్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఎంతో కృషి చేస్తోందని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో పోలీసు అధికారులు మంత్రిని కలిశారు. సూర్యాపేటలో సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టిన ఎస్పీ రాజేంద్రప్రసాద్, అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్, పోలీసు సిబ్బందిని మంత్రి అభినందించారు. ఆధునిక టెక్నాలజీతో కూడిన భవనాలను ఉపయోగించుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు.

## హ్యాట్రిక్ విజయం నాదే : గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో మూడోసారి కూడా గులాబీ జెండా ఎగురుతుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ అభ్యర్థులను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడంతో కిశోర్‌కుమార్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.6,500 కోట్లతో తొమ్మిదేళ్లలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. గతంలో ఆంధ్ర వలస పాలకుల పాలనలో తుంగతుర్తి నియోజకవర్గం వెనక్కి నెట్టబడిందని, అభివృద్ధికి నోచకోక కక్షలు, కారుణ్యాలతో ఉండేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కాళేశ్వరం జలాలతో నియోజకవర్గంలో పంటలు బాగా పండుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథతో అన్ని గ్రామాల్లో తాగు నీరు అందిందన్నారు.నియోజకవర్గంలో మోత్కూరు, తిరుమలగిరి మున్సిపాలిటీలుగా ఏర్పడి అభివృద్ధి పథంలో వెళ్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. తిరుమలగిరి మండలం దళిత బంధు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక అవడంతో 2,223 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి బీసీ బంధు కింద రూ.1లక్ష ఆర్థిక సాయం, గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షలు అందిస్తామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజా ర్టీతో మూడో సారి విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని.. ఎప్పటికైనా ఆ రెండు పార్టీలు ఒక్కటవుతాయని బీజేపీ సూర్యాపేట సెంట్రల్ పార్టీ ఇన్‌చార్జ్, పాండిచేరి ఎమ్మెల్యే అశోక్‌బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని నెమ్మికల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రాష్ట్రానికి ఎన్ని లక్షల ఇళ్లయిన మంజూరు చేయడానికి ప్రధాని సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రకటించిన ఇళ్లకు లబ్ధిదారుల జాబితానే ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని విమర్శించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పార్టీ దళిత, గిరిజన నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు సంకినేని వరుణ్ రావు, మండల ఇంచార్జి కాపా రవికుమార్, జిల్లా కార్యదర్శి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి పాటీ కరుణాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండి అస్లాం, జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు దండ వెంకట్ రెడ్డి, గోగుల వెంకట్ రెడ్డి, తూడి సారయ్య, లింగయ్య, వెంకటరెడ్డి, పర్వతాలు, లింగరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

## డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తే పురుగు మందులు ఆదా



డ్రోన్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ విజయమోహన్

అర్వపల్లి : పంటలకు డ్రోన్ ద్వారా పిచికారీతో రైతులకు 30శాతం పురుగుల మందు ఆదా అవుతుందని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ప్రముఖవైద్యుడు డాక్టర్ విజయమోహన్ అన్నారు. కొమ్మాలలో సోమవారం ఎస్సార్ అగ్రికల్చర్ డ్రోన్ సర్వీస్‌ను ప్రారంభించి మాట్లాడారు. వరి, మిర్చి, పత్తి తదితర పంటలకు డ్రోన్‌తో మందులను పిచికారీ చేయించడం మూలంగా రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు మందు ఆదా అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంగదేరి శ్రీనివాస్, కుంట్ల గోవర్ధన్‌రెడ్డి, రాచకొండ వీరభద్రం, వీరారెడ్డి, బాలస్వామి, శిగ రంజిత్, వెంకట్రాములు, నాగరాజు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనపై బీఆర్ఎస్ సంబరాలు

సూర్యాపేట : మూడోసారి సూర్యాపేట నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి జగదీశ్‌రెడ్డిని కేసీఆర్ ప్రకటించడంతో సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం సంబరాలు అంబరాన్ని అంటాయి. పేటకు అభివృద్ధిని పరిచయం చేసిన జగదీశ్ రెడ్డి మూడోసారి పోటీ చేస్తున్నారని విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ, బాణా సంచా కాలుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళ నాయకులు డాన్సులు వేస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

**తిరుమలగిరి (తుంగతుర్తి)** : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాదరి కిశోర్‌కుమార్‌ను ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు సోమవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దూపటి రవీందర్, కందుకూరి బాబు, సందీప్ నేత, నాని, రమేష్, సామ ఆంజనేయులు, వీరేష్, నరేష్, రాజు, సోమయ్య, నవీన్, పరశురామ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

**అర్వపల్లి** : తుంగతుర్తి శాసనసభ నుంచి మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా కిశోర్‌కుమార్‌ను ప్రకటించడాన్ని హర్షిస్తూ అర్వపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచాలు కాల్చి, మిఠాయిలు పంచి రంగులు చల్లుకొని, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, సర్పంచ్ బి. సునీతారామలింగయ్య, ఎంపీటీసీ కె.పద్మ శ్రీనివాస్, బి.రామలింగయ్య, పి.ప్రభాకర్, చైర్మన్ విద్యాసాగర్, అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, నరేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

**నాగారం** : తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడో సారి గాదరి కిశోర్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంబయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎర్ర యాదగిరి, గుంటకండ్ల ముకుందారెడ్డి, చిప్పలపల్లి సోమయ్య, ఈదుల కిరణ్, కల్లెట్లపల్లి శ్రీనివాస్, మహేందర్, సర్పంచ్‌లు యారాల నర్సింహ్మారెడ్డి, కుంభం కర్ణాకర్, వేర్పుల సాలయ్య, మల్యాల అశోక్, లింగమల్లు, యాదగిరి, గంగయ్య, మహేశ్, మురళీ, నరేష్, యాదగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మద్దిరాల** : స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ప్రకటించడంపై మండల బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బాణ సంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించి కానుగా ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, కన్న వీరన్నగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోడి శ్రీనివాస్, తీగల వెంకన్న, ఆకుల ఉప్పలయ్య, పాతూరి లింగారెడ్డి, మల్లు కళింగారెడ్డి, పాలబిందెల శ్రీనివాస్, నల్ల మధు, రేసు వెంకన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

**తుంగతుర్తి** : తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి మూడో సారి గాదరి కిశోర్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మెయిన్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, దొంగరి శ్రీనివాస్, గడ్డం ఉప్పలయ్య, కటకం వెంకటేశ్వర్లు, చెరుకు పరమేష్, తడకమళ్ల రవి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నూతనకల్** : తుంగతుర్తి అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంపై మండంలో బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్నా మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, చూడి లింగారెడ్డి, బత్తుల సాయిలుగౌడ్, బద్దం ప్రశాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్** : సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో సారి ప్రకటించడంపై మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బాదె ఈశ్వరమ్మ ధర్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కుక్కడపు నరేష్‌గౌడ్ కాకునూరి నాగరాజు, అబ్బగాని భిక్షం, కోటయ్య, కాశయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



తుంగతుర్తి : సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



పెన్‌పహాడ్ : తంగెళ్లగూడెంలో..



అర్వపల్లిలో రంగులు చల్లుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



నాగారంలో..



నూతనకల్ : బాణసంచా కాల్చుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

## కళాభారతి మంజూరు చేయడంపై హర్షం



కేసీఆర్, జగదీష్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న విజయభాను కళా సమితి సభ్యులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో రూ.25 కోట్ల వ్యయంతో భానుపురి కళాభారతి ఆడిటోరియం మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ విజయభాను కళా సమితి అధ్యక్షులు గిలకత్తుల పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, సామాజికవేత్త గుండా రమేష్, జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, విశ్రాంత అధ్యాపకులు హమీద్ ఖాన్, కళాకారులు, రంగస్థల ప్రముఖులు ధనియాకుల సత్యనారాయణ, ధనియాకుల వెంకటేశ్వర్లు, చల్లా సత్యనారాయణ రెడ్డి, ఎం పుల్లారెడ్డి, గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, పద్మ, భాష్యంపల్లి యాదగిరి, బెల్లంకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఆరాధ్య ఫౌండేషన్ సేవలు

అర్వపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఆరాధ్య ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నట్లు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు తాడోజు వాణిశ్రీకాంత్ రాజ్ అన్నారు. సోమవారం అర్వపల్లిలో నిర్వహించిన ఆరాధ్య ఫౌండేషన్ మండల నూతన కమిటీ ఎన్నికలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడిగా బైరబోయిన సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింగ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వజ్జె చిన్నవీరయ్య, అంకిరెడ్డి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఇటీకల చిరంజీవి, కార్యదర్శిగా నాగేంద్రచారి, సహాయ కార్యదర్శులుగా గిరిబాబు, శిగ రవికుమార్, గౌరవ సలహాదారుడిగా ఆంగోతు నర్సింహానాయక్ ఎన్నికయ్యారు. సమావేశంలో తాడోజు ఆచారి, కొమ్ము విజయ్, దాసరి రవీందర్, ఆకారపు శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో నూతన మండల కమిటీ సభ్యులతో శ్రీకాంత్‌రాజ్

## వ్యవసాయ రక్షక దుస్తులపై అవగాహన

గరిడేపల్లి : వ్యవసాయ రక్షక దుస్తులపై హైదరాబాద్‌కు చెందిన సామాజిక విజ్ఞాన కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు సోమవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణులు ఎరువు వేసేటప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకోవాలి, ఆ దుస్తులు శరీరాన్ని ఎలా కాపాడుతాయి అనేదానిపై వివరించారు. తలకు పాత టవల్, పాత దుస్తులు కట్టుకోవాలని సూచించారు. చెమట పీల్చేతత్వం ఉండి, పటుత్వం గల గ్లౌజులు, మాస్క్. కార్యక్రమంలో గ్రామస్తులు దుర్గమ్మ, రేణుక, పద్మ, సుక్కమ్మ, మహేశ్ ఉన్నారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలి

నాగారం : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం సోమవారం హైదారాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్ధమానుకోట గ్రామానికి చెందిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసచారి మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్‌కలెక్టర్లకు ప్రభుత్వం అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు నర్సింహులు, పిల్లి రవి, వెంకటేష్, నాగరాజు, సురేందర్, గట్టయ్య, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఎర్రబెల్లికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

## రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో నెలకొన్న రైతాంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి జిల్లా కార్యదర్శి దొడ్డ వెంకటయ్య కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 మార్చి, ఏప్రిల్, గత సంవత్సరం వడగండ్ల వానతో రైతులు నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలన్నారు. పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ధరణితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట రైతుసంఘం గౌరవ అధ్యక్షుడు మురుగుండ్ల లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

నాగారం : అర్హులైన వారందరికీ దళితబంధు పథకాన్ని వర్తింజేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితబంధు బీఆర్ఎస్ కార్యకర్తలకే కాకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన దళితులందరికి దళితబంధు ఇవ్వాలన్నారు. దళితబంధులో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని, గ్రామాల్లో సర్వే చేసి భూమి లేని, ఇళ్లులేని నిరుపేదలకు దళిత బంధు వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గుడిపూడి వెంకటేశ్వర్లు, బిక్షం, రాములు, అంజయ్య, వెంకన్న, మహేందర్, శ్రీను, యాదమ్మ, మంజుల, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దళితబంధు పథకానికి నిరుపేదలను కాకుండా రాజకీయ అండదండలు ఉన్న వారిని ఎంపిక చేస్తున్నారని, అర్హులైన పేదలకే ముందుగా అవకాశం ఇవ్వాలని తుంగతుర్తి మండలం గొట్టిపర్తికి చెందిన దళితులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించి మాట్లాడారు. గ్రామంలో రెండవ విడత దళితబంధు పథకానికి సుమారు 12 మందిని ఎంపిక చేసినట్లు తెలుస్తోందని, ఇందులో స్థానిక సర్పంచ్, ఎంపిటీసీ బంధువులను మాత్రమే ఎంపిక చేసినట్లు ఆరోపించారు. వినతిపత్రం అందించిన వారిలో సైదులు, అశోక్, మల్లమ్మ, సీహెచ్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ షాపింగ్‌మాల్‌కు జరిమానా

సూర్యాపేట : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెట్టినందుకు గాను సోమవారం మున్సిపల్ కమిషనర్ పి. రామానుజులరెడ్డి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రూ. 10వేలు జిరిమానా విధించారు. పట్టణంలో ఎవరైనా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ సిబ్బంది పేర్కొన్నారు.

## చిత్రహింసలకు గురిచేసిన పోలీసులను శిక్షించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గిరిజన మహిళను లాఠీలతో కొట్టి, చిత్రహింసలకు గురిచేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్లో గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టిన ఏసీపీతో సహా దాడికి కారణమైన ప్రతి ఒక్కరినీ ఉద్యోగంలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ ఎక్కడా కనిపించడం లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలంటే చులకనగా చూస్తూ, వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండానే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అర్ధరాత్రి, మహిళా పోలీస్ లేకుండా గిరిజన మహిళను అరెస్ట్ చేసి, స్టేషన్‌లో తీవ్రంగా కొట్టడం హేయమైన చర్య అన్నారు. దీనిని ప్రగతిశీల మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకళ, కోశాధికారి జయమ్మ, సహాయ కార్యదర్శి సంతోషి మాతా, పద్మ, శ్రీదేవి, వెంకటమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పీఓడబ్ల్యూ నాయకులు

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు సోషల్, సివిక్స్ సబ్జెక్టు‌ను గంటల వ్యవధిలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కుంట రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోపు మోడల్‌స్కూల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### గృహలక్ష్మి దరఖాస్తుదారుల వివరాల సేకరణ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు సోమవారం పంచాయతీ కార్యదర్శులు వెళ్లి వివరాలు సేకరించారు. మండల వ్యాప్తంగా ఈ పథకానికి 1,745 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు సుమారు 800 మంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, సీనియర్ అసిస్టెంట్ జలందర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అనంతుల సత్తయ్య తండ్రి ఆనంతుల మల్లయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, జిల్లా నాయకులు యాదగిరి, ఈదుల కిరణ్, కూరం వెంకన్న, చిప్పలపల్లి సోమయ్య, రాములు, మల్లేష్, సైదులు, యాదగిరి, మహేష్, నవీన్, మల్లయ్య, ఉపేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాంసాగర్ రెండో దశకు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వకు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని ఎంసీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈనెల 25న నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశం కర పత్రాలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, మట్టయ్య జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సైదమ్మ, గోపి, వీరపాపయ్య, నలుగూరి రమేష్, పాల్గొన్నారు.

### ఏఎన్‌ఎంల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

దురాజ్‌పల్లి(సూర్యాపేట): రెండో ఏఎన్‌ఎంలకు అన్యాయం చేసే విధంగా విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనను రద్దుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రెండు ఏఎన్‌ఎంల సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. సోమవారం వారు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ఆరోపించారు. సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు కోట గోపి, మట్టిపల్లి సైదులు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, శ్యాంసుందర్, ప్రభాకర్, రాము, వెంకటేశ్వర్లు ఉన్నారు.

### గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులోని ఎస్టీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.మంజుల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు 22న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఎస్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తుంగతుర్తి : తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాభవాని తెలిపారు. సోమవారం ఆమె మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బైపీసీ–18, ఎంపీసీలో–26, సీఈసీలో –38 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలని సూచించారు.